వెనకటికో ఈగ ఇల్లలుకుతూ అలుకుతూ తన పేరు మరిచి పోయిందిట... అలా మరిచిపోవడానికి, ఈగ కారణాలేవో ఈగ కున్నాయి. మీమట్టుకు మీకే కారణమూ లేదు. నేనే మాట చెప్పినా మీ చెవి దాకా రాదు. వచ్చినా, దాన్ని చెవి నేసుకోరు. మీకు చెప్పినా, ఆ మొండి గోడకు చెప్పినా ఒకటే!" అన్నది మా ఆవిడ విసుగ్గా.

"వంద" అన్నాను మెల్లిగా.

"అదేమిటి?"


"నువ్వీ కథ చెప్పడం, ఇది వందోసారి" అన్నాను.

ఆవిడ నవ్వబోయి మానేసి నట్లనిపించింది.

"అయితే నేనెన్ని సార్లీ కథ చెప్పిందీ, జాగర్తగా లెక్కెట్టుకున్నారన్నమాట!" అంటూ ఒక్క క్షణంపాటు నన్ను పరిశీలనగా చూసింది. "మానాన్న తెల్ల దొరలతో పోట్లాడి స్వరాజ్యం తెచ్చారు. మా అన్నయ్య నల్ల దొరలతో పోట్లాడి సొంత రాష్ట్రం తెచ్చాడు. అయినా ఏం లాభం? నేను మాత్రం మీచేత వో పిచ్చి ముండా ఎలుకల బోను తెప్పించలేక పోతున్నాను" అన్నది సన్నగా నిట్టూరుస్తూ.

మా అత్తగారిది దేశభక్తి వంశమని, మీకీపాటికే తెలిసి ఉండాలి. అలాంటి వంశంలో పుట్టిన వారికబ్బే నేవళాలన్నీ మా ఇంటి దానికీ అబ్బాయి. చిత్రమేమిటంటే, ఇంత కాలంగా కాపరం చేస్తున్నా, ఆ లక్షణాల్లో ఏ ఒక్కటి నాకు వంటపట్టలేదు. అందుకు విచారమూ లేదు.

రావూరి భరద్వాజ



అయితే ఆ లక్షణాలను ఆమోదించడం కూడా నా వల్ల కావడం లేదు.

ఎలుకలబోను తీసుకురావడంలో "చేతగాకపోవడం" అన్నదేమీ లేదు. బద్ధకం అంతకన్నా కాదు, ఘుమ ఘుమలాడే పదార్థాలను బోనుల్లో ఉంచి, వాటికోసం వచ్చిన ఎలుకలను ఆ బోనుల్లో చిక్కుకు పోయేలాగా చేయడంలో నాకు మోసం తప్ప దగా తప్ప ఇంకేమీ కనిపించడంలేదు.

నే నయినా మోపమన్నా దగా అన్నా బొత్తిగా తెలీని అమాయకుణ్ణి కాదు. తెలివైన వారిని వల్లీ కొట్టించడంలో వో పోటీ, సరదా ఉంటుందని కూడా నాకు తెలుసు. నా దృష్టిలో ఎలుకలు తెలివైనవి కావు. అని పిచ్చివి. అమాయకమైనవి. వాటిని చూసి జాలి పడవలసిందే తప్ప పట్టుకోకూడదని నా ఉద్దేశం. ఆ మాటే ఆవిడతో అన్నాను.

"నా మాట మీదకన్నా, ఆ దిక్కుమాలిన ఎలుకల పట్ల మీరెందుకు మొగ్గు చూపుతున్నారో నా కర్థం కావడంలేదు, నేను 'అవు'నన్నదాన్ని మీరు 'కా' దనడమే దీక్షగా పెట్టుకున్నట్టు నాకు తోస్తున్నది" అని రుస రుస లాడిందావిడ.

ఈ వ్యవహారాన్ని ఇంతకన్నా ముదర నివ్వడం మంచిది కాదని తేలిపోయింది. అలా తేలిపోయాక నేనే ముందుగా సంధి సంభాషణలు ప్రారంభించాను.

"చూడొసే! నువ్వు ప్రతిదాన్నీ భూతద్దంలోంచి చూడబోకు. ఆ దిక్కుమాలిన ఎలుకల బోను తీసుకురాకపోవడానికి నా బద్ధకం తప్ప, ఇంకే కారణమూ లేదు. సాయంకాలానికల్లా నేనా బోను తీసుకొస్తే సరి!" అని ఆవిడమీదే వొట్టేసుకొన్నాను.

"చూస్తాగా" అన్నదావిడ నామాట మీద విశ్వాసం లేని దానికి మల్లే!

పరమేశ్వరుని కరుణా కటాక్షంవల్ల నయితేనేం, నా పూర్వ జన్మ సుకృత విశేషం వల్లనయితేనేం, నేను తెచ్చిన ఎలకలబోను మా ఆవిడకు నచ్చింది. అందులో పకోడీలు, ఉల్లిపాయలు ఉంచి, ఎలుకలు బాగా తిరిగే మూలగా, ఆ బోను నుంచి, రోజూ కదనాక్కివేసే తలుపుల్ని ఆ రోజున వార వాకిలిగా ఉంచి- ఇంత కాలానికయినా తన పట్టుదల నేరవేరినందుకు సంతోషించి, నిద్రకు ఉపక్రమించిందావిడ.

క్షమించండి!

నాకయితే నిద్ర పట్టలేదు. ఏ క్షణాన్నయినా ఎలుకలు బోనులో చిక్కుకు పోవచ్చునన్న భయం, నన్నాపాదమస్తకం కుదిపి పారేస్తున్నది. చీమ చిటుక్కుమన్నా నా ప్రాణం జివ్వుమని లేచి పోతున్నది. ఒకానొక దశలో ఆ బోనుకు బిస తప్పించడమో లేదా ఎలుకలు దూరకుండా తలుపుల్ని బిగించడమో చేయకుండా ఊరుకోవడం నాకు అసాధ్యమనిపించింది!

"మీరిక్కడిదాకా 'రారేమో' ననుకొన్నాను. రాకపోతే ఏం చేయాలో నాకు తట్టలేదు. మిమ్మల్ని పక్కకు పిలవడమెలాగో తోచక, ఇందాకణ్ణించి తన్నుకుంటున్నాను. అదృష్టవశాత్తూ మీరే వచ్చారు."

అది కొత్త గొంతుక. నాకు అల్లంత దూరంలోంచి గుస గుస లాడుతున్నట్లుగా వినపడింది. ఆ గొంతుకకోసం కళ్ళు చికిలించి చూస్తున్నాను.

"నే నిక్కడున్నాను. కొంచెంగా వొంగి చూస్తే తప్ప కనబడను. భయపడకండి.. గడిచిన వారం పదిరోజులుగా మీ ఆవిడగారికి కంటినిండా నిద్రలేదు. మిమ్మల్ని పట్టుకోవడానికి మీరు తెచ్చిన సరికొత్త బోనును చూశాక వారు ఆదమరచి నిద్రపోతున్నారు" అన్నది ఎలుక కాస్త ఎకసక్కెంగా.

హత్య చేయడానికో నిముషం ముందు, దొరికిపోయిన హంతకుని లాగా నేను ఎలుకకు దొరికిపోయాను.

"ఇలా లోపలకు రా. ఆ పక్క గదిలోనే మా ఆవిడ ఉంది. అనవసరంగా ఆవిడ నిద్రను పాడుచేయడమెందుకూ? ఈ లోపలయితే తలుపులు కూడా వేసుకొని మనం స్వేచ్ఛగా మాట్లాడుకోవచ్చు" అన్నాను మెల్లగా.


ఎలుక ఫక్కుమని నవ్వి, ఒక్క దూకులో లోపలికొచ్చి, ఎదురుగా ఉన్న దిండుమీద కూచున్నది. నేనేమో కుర్చీలో కూచున్నాను.

"మా ఆవిడ ఆ గదిలో ఉన్నదనీ, ఆవిడ నిద్రను పాడుచేయకమెందుకనీ, నేననగానే ఫక్కుమని నవ్వావెందుకు? ఆవిడకు నేను భయపడుతున్నాననీ, అందుకనే అలా అన్నాననీ నీ అనుమానం. నువ్వు నవ్వింది కూడా అందుకేనని నా అనుమానం. అవునా?" అన్నాను.

"అబ్బే అదేం కాదే!" అన్నది ఎలుక ఆశ్చర్యపోతూ. "మీరు మీ భార్యగారికి భయపడడమూ, వారు, మీకు భయపడడమూ మీ వ్యక్తిగత సమస్యలు. అయినా అందులో నవ్వుకోడానికేమీ లేదు కూడా. నేను నవ్విందెందుకంటే 'స్వేచ్ఛగా మాట్లాడుకోవచ్చు' అని మీరన్నందుకు. సమాన ఫాయా గలవాళ్ళు మాత్రమే స్వేచ్ఛగా మాట్లాడుకోగలుగుతారు. ఎక్కువ తగ్గువలనేవి ఏ రూపంలో ఏ ఇద్దరి మధ్య ఉన్నా, అక్కడ 'స్వేచ్ఛ' అనేది చచ్చిపోయి తీరుతుంది. బలం ఉన్నవారు చెబుతారు. బలంలేని వారు వింటారు బలవంతుడు ఆజ్ఞలను జారీ చేస్తాడు. బలహీనుడు వినయంగా వాటిని అందుకొంటాడు. ఇందులో స్వేచ్ఛకు తావే లేదు. మీరు బలవంతులు. నాకు బలం లేదు. మీరు చెబుతారు. నేను వింటాను. కనుక మనం స్వేచ్ఛగా మాట్లాడుకోవడమన్నది అక్షరాలా అబద్ధం" అన్నది ఎలుక.

మెడకు బెత్తెడు ఎడంగా 'ఫెడీ' మని చరిచినట్టు కిలారించి పోయాను. అందులోంచి బయట పడడానికి నాక్కాస్సేపు పట్టింది.

"మా ఆవిడ పోరు పడలేక నేనో బోను



### ఇంకా 'కాసనోవా' ఇమేజేనా?

ఇటీవల విడుదలైన 'అందాజ్' చిత్రంలో అక్షయ్ కుమార్ సరసన ప్రియాంకాచోప్రా నటించింది. పెళ్లయి. ఓ బిడ్డకు తండ్రి అయినా కూడా అక్కీకి ఇంకా మునుపటి 'కాసనోవా ఇమేజ్‌ను కాపాడుకుంటూనే వున్నాడని బాలీవుడ్ గుసగుసలు. ప్రియాంకతో అక్కీని గురించి ప్రస్తావిస్తే చాలు, ఆమె ముఖం విపరీతమైన సిగ్గుతో గులాబిల రంగుకు తిరుగుతూందట. అన్నట్టు, "జరిగినవేవో జరిగిపోయాయి. మళ్లీ స్నేహంగా వుందాం. నీకేమైనా అభ్యంతరమా?" అనేసి. శిల్పాశెట్టి కూడా అక్కీకి దగ్గరవుతూందని మరో తాజావార్త.

తెచ్చాను. అందులో ఘుమ ఘుమ లాడే వాటినేవో ఉంచి, మీరు తిరిగే చోట ఆ బోనును పెట్టింది మా ఆవిడ. అది తెలియక ఓ బోనులో ఇరుక్కుని మీరు చచ్చిపోతారేమోనని నా భయం. అలా చావకుండా కాపాడదామని వస్తున్నాను. అంతలోకే నువ్వే ఎదురయ్యావు!" అన్నాను.

ఈ మాటలంటున్నంతసేపూ ఎలుక నా ముఖాన్ని పరిశీలనగా చూస్తూనే ఉంది.

"మీ కసలు చావంటే భయమా? లేకపోతే నాలాంటి అల్ప జీవులు చావడమంటే మాత్రమే భయమా?" అన్నది ఎలుక కూపి లాగుతున్న ధోరణిలో.

"చావంటే భయంలేదు అది సహజమైనదైతే! ఇక్కడ జరుగుతున్న దేమిటంటే నీక్కావలసిన తిండిని ఎరగావేసి, నిన్ను మోసంచేసి, దగాచేసి బోనులోకి రప్పించి, ఆ తరువాత చంపుతున్నాం. మోసంతో నిండిపోయిన ఈ తరహా చంపడాలంటేనే నా కసహ్యం. అందుకే ఆ రహస్యాన్ని భరించలేకనే నిన్ను విడిపించుదామని వస్తుంటే " ఎలుక అదోలాగా నాకు నమస్కారం చేసింది!

"మీరన్న మాటలన్నీ నిజమే అయితే మీ దయకు ఎన్నిసార్లు కృతజ్ఞతలు చెప్పుకొన్నా చాలదు .. మీరు నన్ను క్షమిస్తానంటే వో మాటంటాను. మీరన్న దాంట్లో నాకు నటన కనిపిస్తున్నదే తప్ప. నిజాయితీ కనిపించడంలేదు. ఎందుకంటే తిండిని ఎరగా వేసి, ఎలుకల్ని మోసంచేసి చంపుతున్న విధానాన్ని, మీరు భరించలేక పోతున్నామన్నారు. ఇంతకన్నా భయంకరమైన ఎరలను వెదజల్లి అసంఖ్యాకులైన మామూలు మనుషుల్ని, అల్పసంఖ్యాలులైన కొద్దిమంది తెలివైనవారు మోసం చేస్తున్నారు. దగా చేస్తున్నారు. అవి కనిపించకుండా మధ్య మధ్య ప్రజాస్వామ్యమంటున్నారు. సామ్యవాద మంటున్నారు. అడుగునుండి అభ్యుదయమంటున్నారు. ఇవన్నీ ఘుమఘుమ లాడే ఎరలు కావా? వీటిని పదే పదే వూది వూది అధిక సంఖ్యాకులను మోసం చేస్తున్నారు కాదా! ఈ మోసంలో ఈ దగాలో ఇరుక్కుపోయి, గిలగిల లాడుతున్న వారిని గురించి మీరు విచారించిన దాఖలా నా కెక్కడా కనబడలేదు. తిండికోసం దొంగతనాలు చేస్తున్నవాళ్ళు, శీలం అమ్ముకుంటున్న వాళ్లు, అడుక్కుతింటున్న వాళ్ళు, హత్యలు చేస్తున్నవాళ్ళు, అలా చేసినా కడుపు నిండక వటించి వటించి చస్తున్నవాళ్ళు, ఆత్మహత్యలు చేసుకుంటున్నవాళ్ళూ, మీరెటు చూసినా కనపడతారు. వారిని గురించి మీరు జాలిపడ్డారా? వారి నా బోనుల్లోంచి తప్పించడానికెప్పుడన్నా ప్రయత్నించారా?" అన్నది ఎలుక.

దాని ధోరణి చూశాక దోవనపోయే తద్దినాన్ని పిలిచి నెత్తి నెక్కించుకోవడమంటే ఇదేనేమో ననిపించింది!

"అయితే నిన్ను విడిపించాలనుకోవడమే దోషమంటావా?" అన్నాను ఆఖరుకు విసుగెత్తిపోయి.

"మీరు మరోసారి నన్ను మన్నించాలి. 'నన్ను విడిపించడం దోష' మని నేననడం లేదు. రకరకాల ఎరలకోసం ఆశపడి అనేక రకాల బోనుల్లో కూరుకుపోతున్న మనుషుల్ని గురించి పట్టించుకోక పోవడం దోషమని చెప్పడమే నా ఉద్దేశం. మరి నాకేమో, మీకు తెలిసినన్ని సునోజనాలు తెలియవు. నా పిచ్చి ధోరణిలో చెప్పి, మిమ్మల్ని విసిగించి ఉంటాను" అని తల బాదుకొన్నది ఎలుక. "నేను, బోనులో ఇరుక్కుంటానేమోనని మీ భయం. ఒకవేళ ఇరుక్కుంటే నన్ను విడిపించి, వో మంచివని చేశానన్న తృప్తిని పొందుదామని మీరాశించారు. నేనేమో, ఆ బోనులో చిక్కుకోకుండా, నేరుగా మీదగ్గరకు వచ్చి, మీకా తృప్తి లేకుండా చేసి, మిమ్మల్ని బాధించాను. మీలాంటి మంచివారినలా బాధ పెట్టకూడదు. అంచాత ఆ బోను దగ్గరకు పోదాం పదండి. నేనేమో అందులో దూరిపోతాను. ఆ తరవాత మీరు నన్ను విడిపించేసి, తృప్తి పడుదురు గాని!" అన్నది ఎలుక.

ఇద్దరం బోను దగ్గర కొచ్చాం.

నిస్సంకోచంగా, ఎలుక బోనులోకి దూరింది. నేను బోను తలుపును అటూ ఇటూ కదిపి చూశాను.

"ఇక నన్ను విడిపించి తృప్తి పడండి స్వామీ!" అన్నది ఎలుక మెరిసిపోతున్న కళ్ళతో.

బోను తలుపు ఒకంతట తెరుచుకోదని గట్టి నమ్మకం కలిగాక, బోను నక్కడే వదిలేసి, గది తలుపుల్ని వేస్తున్నప్పుడు -

"అదేమిటి?" అన్నది ఎలుక బిత్తరపోతూ.

"అదంతే!" అన్నాను.

ఎలుక ఒక్క నిమిషం ఒకే ఒక్క నిమిషం నన్ను గుచ్చి గుచ్చి చూసింది.

"మీకు రుచించని సత్యాన్ని, రుచించని ధోరణిలో చెప్పానని, నేను ఆలస్యంగా గ్రహించాను. ఈ పొరపాటు నాదే! నేనే బోనులోకి దూరాక, మీరు నన్ను విడిపించరేమోనన్న అనుమానం నాకు వచ్చి ఉండవలసింది. రాలేదు. అలా రాకపోవడం కూడా నా పొరబాటే! మీ మోసానికీ, దగాకూ లొంగిపోయి, నా వారందరూ మూకుమ్మడిగా బోనులో చిక్కునడిపోకుండా నేను మాత్రమే ఇరుక్కొని, మిగతా వారిని కాపాడగలిగాను. అదొక్కటే నా కిందులో మిగిలిన సంతృప్తి. మనుషుల్లో ఎలాంటి విశ్వాసఘాతకులూ, నమ్మక ద్రోహులూ, నయవంచకులూ ఉంటారో, మావాళ్ళిప్పటి కన్నా ప్రత్యక్షంగా తెలుసుకుంటారు. నన్ను చూసయినా వారు నేర్చుకొంటారు..."

నేనింకా అక్కడే ఉంటే, ఏ చెత్త వాగేదో నాకు తెలియదు. తెలుసుకోవాలని కూడా నా కనిపించలేదు. అందుకని తలుపులు బిగించి ఇవతలి కొచ్చేశాను.

ఇప్పుడా ఎలుకమీద నాకు పిసరంత జాలి కూడా లేదు.

ఎందుకుంటుందీ?

అది ఎలుక!

నేను మనిషిని!!

## రోగులకు శుభవార్త

మధుమేహం, అల్జీమిర్స్, పార్కిన్సన్ జబ్బులున్న వారికి నిజంగా శుభవార్త. కొత్త రకం 'డాక్టర్డ్ చిప్స్' అనే మందు నింపిన చిప్స్‌ను ప్రవేశపెట్టబోతున్నారు వైద్యరంగనిష్ణాతులు. మూడు సెంటిమీటర్ల పొడవుండే, బాటరీలతో పని చేసే ఈ మెడికేటెడ్ చిప్స్‌ను డాక్టర్లు శరీరంలో సెట్ చేస్తారు. సమయం కాగానే బాటరీ సాయంతో మందులు శరీరంలోకి వెళతాయి. చిన్న చిన్న పాకెట్లలో వున్న మందు రక్తంలో కలిసి కరిగిపోయి స్వస్థత చేకూరుస్తుంది.

